క్లుప్తంగా

పార్థనాయుడు మృతి పార్టీకి తీరని లోటు


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పార్థనాయుడు మృతి పార్టీకి తీరనిలోటు అని మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. మొలకలపెంట గ్రామానికి చెందిన పార్థనాయుడు మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి బుధవారం ఉదయాన్నే గ్రామానికి చేరుకొని పార్థనాయుడు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భగవంతుడు పార్థనాయుడు కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మొలకలపెంట సర్పంచ్ మురహరినాయుడు, ఎంపీటీసీ నాగప్ప, ఇతర నాయకులు ఉన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్యే జయరామ్, ఆర్డీఓ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ భవానిని కార్మిక జేఏసీ నాయకులు కోరారు. బుధవారం మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగపు జేఏసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లేష్ ఆధ్వర్యంలో కార్మికులు ముగ్గురిని వేర్వేరుగా కలిసి వినతిపత్రాలను అందజేశారు. పెరిగిన సరుకుల ధరలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనమివ్వాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని వారు కోరారు. కార్మిక నాయకులు సురేంద్ర, మస్తాన్, లక్ష్మీనారాయణ, సుంకన్న పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


డ్రైనేజీ నిర్మాణానికి పూజచేస్తున్న ఎమ్మెల్యే జయరాం, చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పోర్టర్స్‌లైన్‌లో నూతన డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే జయరామ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని బుధవారం భూమిపూజ చేశారు. కొత్తగా కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ నయీమ్ అహ్మద్, అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: గోకులం షెడ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. బుధవారం దోసలుడుకి గ్రామంలో రూ.4.6 లక్షలతో నిర్మించిన రెండు గోకులం షెడ్లను ప్రారంభించారు. గుండాల తండాలో రూ.1.25 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు, రూ.25 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు.

పామిడి: వంకరాజుకాలువ గ్రామానికి రూ.1.98 కోట్లతో బీటీరోడ్డు, మిడుతూరు నుంచి ఎదురూరు గ్రామానికి రూ.90 లక్షలతో బీసీ రోడ్డు, పామిడి కస్తూర్బా పాఠశాలలో రూ.1.26 కోట్లతో బాలికల హాస్టల్ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం భూమిపూజ చేశారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

గుత్తి: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. క్రైమ్ రేటుపై ఆరా తీశారు. పోలీసు సిబ్బంది పని తీరుపై సమీక్షించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సీఐ వెంకటేశ్వర్లును ఆదేశించారు.

డంపింగ్ యార్డు పరిశీలన


వర్మీకంపోస్టును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ విజయకుమార్‌రెడ్డి

యాడికి: మండల కేంద్రంలోని చందన రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును బుధవారం డీఎల్‌పీఓ(డివిజనల్ పంచాయతీ ఆఫీసర్) విజయకుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తడి , పొడి చెత్తను ఎలా వేరు చేయాలో సిబ్బందికి వివరించారు. అనంతరం వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎండీఓ వీర్రాజు, సర్పంచు అనురాధ, పంచాయతీ అధికారి లక్ష్మేంద్ర, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన పంపిణీ మొదలుపెట్టరా?

• సబ్సిడీ కాయల కోసం రైతన్నల ఎదురుచూపు • ఖరీఫ్ మొదలైనా విత్తనకాయలు అందని వైనం

గుంతకల్లు రూరల్: అతివృష్టి, అనావృష్టి కారణంగా గతేడాది తీవ్రమైన పంటనష్టాన్ని చవిచూసిన రైతన్నలకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే కష్టాలు మొదలయ్యాయి. సాగుచేసిన పంటలు చేతికి అందక చేసిన అప్పులు తీర్చేమార్గం కానరాక పుట్టెడు కష్టాల్లో ఉన్న అన్నదాతలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అనుకున్న సమయానికి కనీసం సబ్సిడీ వేరుశనగనైనా అందిస్తారా అంటే అదీలేదు.


ఆర్‌ఎస్‌కేలో ఉంచిన విత్తన వేరుశనగ

తగ్గుతున్న సాగు విస్తీర్ణం

గుంతకల్లు మండలంలో దాదాపు 70 వేల ఎకరాల సాగుభూమి ఉండగా ఇందులో ఏటా దాదాపు 50 వేల నుంచి 55 వేల ఎకరాల్లో పంటసాగు అవుతుంది. ప్రస్తుతం 18 వేల నుంచి 20 వేల ఎకరాల్లో మాత్రమే పంట సాగవుతోంది. రెండేళ్లుగా తీవ్రమైన పంట నష్టం రావడంతో అప్పులు ఊబిలో కూరుకుపోయిన రైతన్నలు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పంటసాగుకు చేతిలో చిల్లిగవ్వ కూడా లేక ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తూ వచ్చారు. అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ.20 వేలు అన్నదాతలకు అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం గతేడాది ఆ ఊసే ఎత్తలేదు. మరోవైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా ప్రభుత్వం విత్తన కాయలు పంపిణీ చేయడం లేదు.

ఆర్‌ఎస్‌కేల్లో కాయలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మండలానికి ఏటా 3500 క్వింటాళ్ల నుంచి 4 వేల క్వింటాళ్ల వరకూ కేటాయించే వారు. కానీ కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కేవలం 2200 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించింది. ప్రస్తుతం ఒక్కో ఆర్‌ఎస్‌కేకు 100 క్వింటాళ్ల చొప్పున 1500 క్వింటాళ్లు మాత్రమే చేరింది. కనీసం అందుబాటులో ఉన్న విత్తన వేరుశనగనైనా రైతులకు పంపిణీ చేస్తారనుకుంటే ఆర్‌ఎస్‌కేలకే పరిమితం చేశారు. విత్తన పంపిణీ ప్రారంభం కాకపోవడంతో దిక్కుతోచని రైతన్నలు తలలు పట్టుకుంటున్నారు.

దిక్కుతోచడం లేదు



వర్షాభావం, తుఫాను కారణంగా గతేడాది పంట తుడిచి పెట్టుకుపోయింది. దాదాపు రూ.60 వేల వరకూ నష్టపోయా. కనీసం ఈ ఏడాదైనా ప్రభుత్వం పంటసాయం అందించి ఆదుకుంటుందనుకుంటే ఇంతవరకూ అతీగతీలేదు. అప్పులు చేసి పంటసాగుకు పొలాలను సిద్ధం చేసుకున్నాం. కానీ ఇంతవరకూ సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేయలేదు. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

–ఓబుళప్ప, రైతు, వైటీ చెరువు

గతంలోఎన్నడూ ఇలా జరగలేదు



ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి 15 రోజుల ముందే విత్తన వేరుశనగ, కందులు పంపిణీ చేసేవారు. పెట్టుబడి సాయం కూడా ముందుగానే అందేది. ఈ ఏడాది సీజన్ ప్రారంభమైనా విత్తన వేరుశనగ పంపిణీ చేయలేదు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు వస్తుందనకున్నా అదీ రాలేదు. ఇలా అయితే రైతుల బతుకులు ఏం కావాలి.

– హరిచక్రవర్తి, రైతు, శంకరబండ

కొత్త ఏఓ రాగానే విత్తన పంపిణీ



ఉద్యోగుల బదిలీల కారణంగా విత్తన పంపిణీ ప్రక్రియ ఆలస్యం అయింది. నేను బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో నా స్థానంలో గురువారం మరొకరు బాధ్యలు తీసుకుంటారు. వారు వచ్చిన వెంటనే విత్తన పంపిణీ చేపడతారు.

– విజయ్‌కుమార్, ఏఓ, గుంతకల్లు

పంచాయతీ కార్మికులకు నిత్యావసరాల పంపిణీ

బుక్కరాయసముద్రం: బీకేఎస్ మేజర్ పంచాయతీలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న పంచాయతీ కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ శారు. బుధవారం సర్పంచ్ పార్వతి, సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప చేతులు మీదుగా వాటిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కార్మికులుగా పనిచేసి మృతి చెందిన వపన్‌కుమార్, పక్షవాతంతో ఉన్న నల్లప్ప, అపెండిసైటిస్‌తో ఇబ్బంది పడుతున్న ఎర్రినాగయ్య, క్యాన్సర్‌తో బాధ పడుతున్న తాడిపత్రి సూరమ్మ, చింతామణి, వెంకటలక్ష్మిలకు ఒక్కొక్కరికి 100 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు, రూ.వెయ్యి నగదు, చొప్పున పంపిణీ చేశామన్నారు. పంచాయతీ వర్కర్లు, సీఐటీయూ అనుబంధ సంఘాల ద్వారా దాతల నుంచి సరుకులు సేకరించారన్నారు. పండ్ల తోటల రైతుల సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నేతలు నాగేంద్ర, ఎర్ర కొండప్ప, సుబ్రమణ్యం, నాగరాజు, బాలప్ప, నాగేంద్ర, వెంకటమ్మ, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.


సరుకులు అందిస్తున్న సర్పంచ్ పార్వతి

ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలని నిరసన

గుత్తి రూరల్: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలని ఆర్డీటీ లబ్ధిదారులు, బీఎస్పీ, సీపీఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం వారు నిరసన తెలిపారు. ముందుగా పట్టణంలోని గాంధీ చౌక్ నుంచి కర్నూలు రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకుడు బండల రామాంజనేయులు, సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వైటీసీ.రమేష్ మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్‌ను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడం సరికాదన్నారు. కరువు కాటకాలతో అల్లాడుతున్న అనంతపురం జిల్లాలో 50 సంవత్సరాలుగా పేద ప్రజలకు విద్య, వైద్యంతో పాటుగా అనేక సేవలు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ ఆర్డీటీ సంస్థకు నిధులు రాకుండా అడ్డుపడటం దారుణమన్నారు. నిధులు విడుదల చేసే వరకూ తమ పోరాటాలు, ఉద్యమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ ఓబులేసుకు వినతి పత్రం అందజేశారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

పెద్దవడుగూరు : అప్పేచర్ల గ్రామంలో సీపీఐ నాయకులు బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రైతుల సమక్షంలో ఎద్దులను నాగలికి కట్టి భూదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాముడుయాదవ్, తాడిపత్రి నియోజక వర్గ అధ్యక్షుడు ఆదినారాయణ మాట్లాడుతూ రైతులు తమ వ్యసాయ పనులను ప్రారంభించడానికి ఏరువాక పౌర్ణమిని సుభసూచికంగా భావిస్తారన్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో కురిసి, పంటలు బాగా పండి ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీతో డీజిల్, పెట్రోల్ సరఫరా చేయాలన్నారు. మైక్రో ఇరిగేషన్ పరికరాలను 75 శాతం సబ్సిడీ తో అందించాలన్నారు. రైతులకు వడ్డీ లేకుండా రూ.5 లక్షల దాకా పంట రుణం అందించాలని డిమాండ్ చేశారు. పెద్దవడుగూరు సీపీఐ కార్యదర్శి పోలా రంగస్వామి, నారాయణ స్వామి, రామాంజనేయులు, అల్లాబకాష్, పెద్దన్న, శరత్ తదితరులు పాల్గొన్నారు.


అప్పేచర్లలో ఎద్దులకు నాగలి కట్టి పూజలు చేసిన సీపీఐ నాయకులు

తాడిపత్రి చిన్నారుల ప్రతిభ

తాడిపత్రిటౌన్: పట్టణానికి చెందిన వందన డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఇంటర్‌నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు సాధించినట్లు అకాడమీ నిర్వాహకులు వందన, ప్రవీణ్ బుధవారం తెలిపారు. గత నెల 9న ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హిమాలయాల్లో ఉన్న తుంగనాథ్ శివాలయం ముందు సముద్ర మట్టానికి 12,078 అడుగుల ఎత్తులో –3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో విద్యార్థులు సాయిమైత్రి, జ్యోషిత, హాసిని, శ్రీనవ్య, గీర్వాణి, నిదిశ్రీ, నిహారిక, చిన్మయి, శ్రీశన్విత, అనిషా, హిరిప్రియ, ఆరాధ్య, నిహారిక భరతనాట్యం ప్రదర్శించారన్నారు. ఇందుకుగాను ఇంటర్‌నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు లభించిందన్నారు. ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులు విద్యార్థులను అభినందించారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు

పశువుల నీటి తొట్టెలు ప్రారంభం

గుత్తి రూరల్: మండలంలోని తురకపల్లి, కొత్తపేట గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన నీటి తొట్టెలను బుధవారం ఉపాధి హామీ అధికారులు ప్రారంభించారు. పశువుల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా నీటి తొట్టెలను నిర్మించారు.

పెద్దవడుగూరు : మిడుతూరు గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించిన నీటి తొట్టెలను మండల ప్రత్యేక అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్మించిన ఆవులు, గొర్రెల షెడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బారస్ సాహెబ్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: వేములపాడులో రూ.38 వేలతో నిర్మించిన పశువుల నీటితొట్టెను ఎంపీడీఓ వీర్రాజు, ఏపీఓ మద్దయ్య బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు వారు పెద్దపేట గ్రామంలో ఫారంపాండ్ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

యాడికి: యాడికి మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు బుధవారం అనంతపురం, నంద్యాల జిల్లాల్లో మృతి చెందిన అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తి చేశారు. వివరాలు..పెద్దపప్పూరులో హమాలీ సిద్దప్ప అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరూ లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి గంగా మహేశ్వరరెడ్డి, వీఆర్ఓ సుంకన్న ద్వారా సమాచారం అందుకున్న మే ఐ హెల్ప్‌యూ సభ్యుడు బండారు బాలకృష్ణ తన సహచరులతో పెద్దపప్పూరుకు వచ్చి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. అలాగే నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లిలో ఓ అనాథ వృద్ధురాలి అంత్యక్రియలు పూర్తి చేశారు.


పెద్దపప్పూరులో అనాథ మృతదేహాన్ని తీసుకెళ్తున్న మే ఐహెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు

చికిత్స పొందుతూ వివాహిత మృతి

గార్లదిన్నె: గతనెల ఆత్మహత్యాయత్నం చేసిన మండలంలోని కోటంకకు చెందిన సుబ్రహ్మణ్యం భార్య ఉమాదేవి (39) చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామంలో తమకున్న 4 ఎకరాల్లో వేరుశనగ, మరో 3 ఎకరాలో చీనీ పంట సాగు చేశారు. పంటల పెట్టుబడి కోసం ఇతర రైతుల వద్ద నుంచి రూ.5లక్షల వరకు భర్త అప్పులు చేశాడు. ఇటీవల తమ అప్పు తీర్చాలంటూ తరచూ వారు ఇంటి వద్దకెళ్లి గొడవ చేస్తుండడంతో దంపతుల మధ్య మనస్పర్థలు చెలరేగాయి. దీంతో మనస్తాపానికి లోనైన ఉమాదేవి గత నెల 21న క్రిమి సంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. కోలుకున్న తర్వాత ఇంటికి వచ్చిన ఆమె ఆరోగ్యం బుధవారం ఒక్కసారిగా క్షీణించడంతో సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతిచెందింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


ఉమాదేవి (ఫైల్)

పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత వసతి

పామిడి: అనంతపురంలోని ఆర్యవైశ్య హాస్టల్‌లో పేద వైశ్య విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్యవైశ్యహాస్టల్ సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు టీ జగదీష్ తెలిపారు. బుధవారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయానికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. హాస్టల్‌లో వేడినీటి సరఫరా, డిజిటల్ లైబ్రరీ, సువిశాల ఆటస్థలం ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆసంస్థ కోశాధికారి సత్యరంగయ్య, డిప్యూటీ వార్డెన్ మంజునాథ్, స్థానిక ఆర్యవైశ్యం సంఘం నాయకులు బీవీ రత్నమయ్య, నల్లయ్య, శివరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న కమిషనర్ జబ్బార్‌మియా

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీ(22వ వార్డు)లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఎంత మంది పిల్లలు ఉన్నారో ఆరా తీశారు. సమయపాలన పాటించాలని అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాను ఆదేశించారు.

లారీ బండల సేకరణ

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో అన్నదాన కేంద్రం విస్తరణలో భాగంగా బేతంచెర్లలో దాతల నుంచి లారీలోడ్ బండలను సేకరించినట్లు ఆలయ ఈఓ కే.వాణి తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న అన్నదాన సత్రం విశాలం తక్కువగా ఉండటంతో అందులో ఒకసారి వందమంది భక్తులు మాత్రమే భోజనం చేయగలరు. దీంతో ఒకేసారి 400 మంది భక్తులు కూర్చొని భోజనం చేసేలా అన్నదాన సత్రాన్ని విస్తరించనున్నారు. ఈ క్రమంలో ఆలయ ఏఈఓ వెంకటేశ్వర్లు తన సిబ్బందితోకలిసి బేతంచెర్లకు చేరుకొని అక్కడ కొంతమంది బండల వ్యాపారుల నుంచి లారీలోడ్ బండలను విరాళంగా స్వీకరించారు. ఈసందర్భంగా దాతలకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉద్యోగాల కల్పనకు చర్యలు

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. బుధవారం కొర్రపాడు గురుకుల పాఠశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేలా చర్యలు చేపడుతామన్నారు. కొర్రపాడు గురుకుల పాఠశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు 50 ప్రముఖ కంపెనీలు, 500 మంది దాకా నిరుద్యోగ యువత హాజరయ్యారన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్మాన్, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే శ్రావణి శ్రీ

ఘనంగా నారాయణుడి కల్యాణం


ఉత్సవమూర్తులను పెళ్లి మండపానికి తీసుకెళ్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వత్థనారాయణస్వామి క్షేత్రంలో బుధవారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగారామకోటి కాలనీకి చెందిన సత్యనారాయణ యాదవ్, లక్ష్మీనారాయణమ్మ దంపతులు స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. అర్చకులు సుధీర్ కుమార్ శర్మ,బాలసుబ్రమణ్య శర్మ, సునీల్ కుమార్‌లు ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో పెళ్లి మండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చి శాస్త్రోక్తంగా వివాహం చేశారు. అనంతరం స్వామి వార్ల దర్శనానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటుచేశారు. స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించదలచుకున్న భక్తులు నెలరోజులు ముందుగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఈఓ సుబ్రమణ్యం పేర్కొన్నారు.

దళితుల భూ సమస్యలు పరిష్కరించండి


తహసీల్దార్ ఈరమ్మకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గార్లదిన్నె: దళితుల భూ సమస్యలు పరిష్కరించాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకేహరి కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటంక పొలం సర్వే నంబర్ 101లో ఏడుగురు దళితులకు 1979లో 18.21 ఎకరాల భూమిని ప్రభుత్వం డీ పట్టాలు ఇచ్చిందన్నారు. అలాగే కేటాయించి విధంగా భూమి లేదేని ఉన్న భూమిని ఇతరులు కబ్జా చేశారన్నారు. రైతులు తమ భూములకు హద్దులు చూపించాలని రెండేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వేలో కూడా రైతులకు న్యాయం జరగ లేదన్నారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాసులు, రమేష్, రామక్రిష్ణ, రైతులు సుబ్బయ్య, ఆంజనేయులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బెటాలియన్‌లో యోగాంధ్ర

బుక్కరాయసముద్రం: జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బెటాలియన్ కమాండెంట్ ప్రభుకుమార్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, జిల్లా అధికారులు హాజరవుతారన్నారు.

పాఠశాల నిర్మాణానికి విరాళం

పామిడి: పట్టణంలోని నిట్టూరు నిలయం పాఠశాలలో గదుల నిర్మాణానికి బుధవారం స్థానిక డాక్టర్ బొక్కెం రామిరెడ్డి విజయమ్మ దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ డబ్బు వారు స్కూల్ కమిటీ సభ్యులకు అందజేశారు. స్కూల్ కమిటీ సభ్యులు డాక్టర్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫాం సరఫరా

గుత్తి: గుత్తి టౌన్‌తో పాటు మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం వచ్చాయని ఎంఈఓ రవి నాయక్ బుధవారం తెలిపారు. గురువారం వాటిని పాఠశాలలకు పంపుతామన్నారు. మొత్తం 8,896 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, టెక్స్ట్ పుస్తకాలతో పాటు యూనిఫాం, బూట్లు సరఫరా అయినట్లు వివరించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని మార్నేపల్లిలో ఓ యువకుడు బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన రాజేష్ గొర్రెల పెంపకంతో జీవనం సాగించేవాడు. కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో పాటుగా వ్యక్తిగత సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన అతడు గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న స్థానికులు, కుటుంబసభ్యులు అపస్మారక స్థితిలో పడి ఉన్న రాజేష్‌ను గమనించి వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురం తరలించారు.